

పుచ్చ సాగుకు సమయమిదే

రబీలో ఆరుతడి పంటగా పుచ్చను సాగు చేసి లాభాలు పొందవచ్చంటున్నారు ఉద్యానవన అధికారులు. 8లో▸



వీకెండ్ విహారం..

వీకెండ్ వచ్చిందంటే చాలు పర్యాటకులు కోట్‌పల్లి ప్రాజెక్టుకి తరలుతున్నారు. బోటింగ్ చేస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. 8లో▸



వైభవోపేతంగా దీపోత్సవం

పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో దీపోత్సవం నిర్వహించారు. 9లో▸

న్యూస్‌రీల్

బీసీల అభ్యున్నతికి కృషి



ఆర్.కృష్ణయ్యను సన్మానిస్తున్న రాళ్లగుడుపల్లి వాసులు

మోమిన్‌పేట: నూతనంగా ఎంపికైన రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను రాళ్లగుడుపల్లికి చెందిన లక్ష్మయ్య తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఇటీవల ఎంపిక కావడంతో ఆదివారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీల అభివృద్ధికి తాను నిరంతరం పోరాడుతానన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

డైట్ చార్జీల పెంపు హర్షణీయం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్

బంట్వారం: వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్‌యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని వివిధ హాస్టళ్లలో 7.65 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. 3 నుంచి 7వ తరగతి వరకు రూ.950 నుంచి రూ.1330, 8 నుంచి 10వ తరగతి వరకు రూ.1,100 నుంచి రూ.1,540, ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు రూ.1,500 నుంచి రూ.2,100 వరకు డైట్ చార్జీలు పెరిగినట్లు ఆయన తెలిపారు. కాస్మోటిక్ చార్జీలు సైతం పెంచడం అభినందనీయమన్నారు. బాలికలకు 3 నుంచి 7వ తరగతి వరకు రూ.55 నుంచి రూ.175 పెంచారన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం తరపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

18న బహిరంగ వేలం

అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని అనంతగిరిగుట్ట శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో ఏడాది పాటు పార్కింగ్ ఫీజు వసూలు, కొబ్బరికాయల విక్రయ హక్కులకు ఈనెల 18న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టీ పద్మనాభం, ఈఓ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు అనంతగిరి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తారని వివరించారు. వేలంలో పాల్గొనే వారు రూ.లక్ష డిపాజిట్ చేయాలన్నారు. హక్కు పొందని వారికి డిపాజిట్ వాపసు ఇవ్వబడుతుందన్నారు. కావున ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు.

హిందూ సమాజ రక్షణకు త్రిశూల్ దీక్ష తీసుకోవాలి



హనుమాన్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

హుడాకాంప్లెక్స్: హిందూ సమాజ రక్షణకు యువత బజరంగ్‌దళ్‌లో చేరి త్రిశూల్ దీక్ష తీసుకోవాలని జనగణమన ఉత్సవ సమితి అధ్యక్షుడు విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. విశ్వ హిందూ పరిషత్, వివేకానంద జిల్లా బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఆదివారం సరూర్‌నగర్ మండల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన త్రిశూల్ ప్రతిజ్ఞ దీక్ష కార్యక్రమానికి వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, కశ్మీర్ ఫైల్స్ సినీ నిర్మాత అభిషేక్ అగర్వాల్‌తో పాటు విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశం కోసం, సమాజం కోసం యువత ముందుకు రావాలని కోరారు. హిందువుల సంఖ్య నానాటికీ తగ్గుతోందని, అన్య మతస్తుల సంఖ్య పెరుగుతోందని, అతికొద్ది కాలంలోనే హిందూ జనాభా 90 శాతం కంటే దిగువకు వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సనాతన ధర్మమే దేశ రక్షణకు దోహదపడుతుందని, హిందూ ధర్మాన్ని కాపాడటానికి ప్రతి హిందువు మేల్కొనాలని సూచించారు. మత మార్పిడులను అరికట్టాలని, లవ్ జిహాదీలను అడ్డుకోవడానికి తమ వంతు కృషి చేయాలని కోరారు. శక్తిని పెంచుకోవాలని త్రిశూల్ దీక్షతోనే అన్యమతస్తులను ఎదుర్కోవడం సాధ్యమవుతుందని స్పష్టం చేశా. కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు పాల్గొన్నారు. అనంతరం సరూర్‌నగర్ ప్రధాన రహదారిపై హనుమంతుని విగ్రహాన్ని ఊరేగించారు.

❖ మళ్లీ గజగజ

- జిల్లాలో రికార్డు స్థాయిలో పడిపోయిన ఉష్ణోగ్రతలు
- మోమిన్‌పేటలో కనిష్టంగా ఈ8.2 డిగ్రీలు నమోదు



చలిమంట కాచుకుంటున్న జనం

బషీరాబాద్: జిల్లాలో మళ్లీ ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. ఆదివారం మోమిన్‌పేట మండల కేంద్రంలో 8.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యల్పంగా రికార్డయిందని వాతావరణశాఖ జిల్లా అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. గడిచిన రెండు వారాల పాటు జిల్లాలో చలి తీవ్రత తగ్గి సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యాయి. మళ్లీ నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరుగుతుంది. దీంతో జనం బయటకు రావడానికి జంకుతున్నారు. చలి నుంచి రక్షణ కోసం చలిమంటలు కాచుకుంటున్నారు. రాబోయే రోజుల్లో మరింతగా ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశం ఉందన్నారు.

❖ కనులపండువగా మల్లన్న జాతర

తాండూరు రూరల్: మండల పరిధిలోని గౌతపూర్ గ్రామంలో మల్లికార్జున స్వామి జాతర కనులపండువగా నిర్వహించారు. మూడు రోజులుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఉదయం మల్లన్న స్వామి పల్లకీ సేవ చేశారు. చక్రస్నానం తర్వాత స్వామి వారిని డోలు, డప్పు వాయిద్యాలతో ఒగ్గు కళాకారుల నృత్యాలతో ఆలయానికి తీసుకొచ్చారు. గ్రామంలోని మహిళలు బోనాలతో తరలివచ్చి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. జాతర సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు ఆలయం చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారి చంద్రయ్య స్వామి, నరేందర్‌రెడ్డి, రాజప్పగౌడ్, నాగప్ప, శకుంతల, వీరేందర్‌రెడ్డి, మంజుల, వెంకటేశం, రాంలింగారెడ్డి, వెంకటయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో మహిళల ప్రదక్షిణలు



నిలిచిపోయిన చించల్‌పేట్ గేట్-నరేగూడ రోడ్డు పనులు

నిధులున్నా.. అదే దారి!

2020-21లో జిల్లాకు 13 రోడ్లు మంజూరు

- 93.9 కిలోమీటర్ల నిర్మాణానికి రూ.56.85 కోట్ల అంచనా వ్యయం
- పనులను మధ్యలోనే వదిలేస్తున్న కాంట్రాక్టర్లు
- ప్రమాదాల బారిన ప్రయాణికులు
- మూడేళ్లు గడిచినా పూర్తి కాని పీఎంజీఎస్‌వై రోడ్లు

వికారాబాద్: ఈ ఫొటోలో కనిపిస్తున్న రోడ్డు నవాబుపేట మండల పరిధిలోని చించల్‌పేట్, అక్నాపూర్ మీదుగా నారేగూడ వెళ్లేదారి. 20 ఏళ్ల క్రితం పీఎంజీఎస్‌వై పథకం కింద చించల్‌పేట్ గేట్ నుంచి అక్నాపూర్ వరకు ఎనిమిది కిలోమీటర్ల రోడ్డు వేశారు. ఈ రోడ్డు ఆరేళ్ల క్రితమే గుంతలమయంగా మారింది. అధికారుల వరుస ప్రతిపాదనలతో మూడేళ్ల క్రితం చించల్‌పేట్ గేట్ నుంచి అక్నాపూర్ వరకు ఎనిమిది కిలోమీటర్లకు రీబీటీ, అక్నాపూర్ నుంచి నాగరేగూడ వరకు ఉన్న నాలుగు కిలోమీటర్లకు కొత్తగా రోడ్డు నిర్మించేందుకు రూ.12కోట్లు మంజూరు చేశారు. నిధులు మంజూరై మూడేళ్లు దాటినా పనులు 50 శాతం కూడా పూర్తికాలేదు. మొత్తం 12 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి గాను మూడు కిలోమీటర్ల రోడ్డు వేసి చేతులు దులుపుకొన్నారు.

పెరుగుతున్న వ్యయం

2020–21 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు పీఎంజీఎస్‌వై కింద 13 రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. 93.9 కిలోమీటర్లు బీటీ రోడ్లు వేయాలని నిర్ణయించారు. ఇందుకు రూ.56.85 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశారు. వీటిలో కొన్ని రోడ్లు రెండున్నరేళ్ల క్రితం.. మరికొన్ని రెండేళ్లగడిచాయి. ఇందులో ఎనిమిది రోడ్ల నిర్మాణం ఇటీవలే పూర్తవగా మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయి. నిర్మాణంలో ఉన్న రోడ్లలో కొన్ని చోట్ల పనులు ప్రారంభించి వదిలేశారు. నిర్మాణ వ్యయం ఎక్కువ అవుతుండడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. రోడ్ల నిర్మాణం మధ్యలో వదిలేయడం.. ఆలస్యంగా చేపట్టడం.. కొన్ని చోట్ల కంకర, మరికొన్ని చోట్ల మట్టి పోసి వదిలేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

రోడ్ల నిర్మాణంతో ప్రాంతాల కనెక్టివిటీ.. ఆలయా ప్రాంతాల అభివృద్ధికి దోహదం చేస్తాయి. కానీ ప్రభుత్వం ఆదిశగా దృష్టి సారించడం లేదు. దీంతో చాలా వరకు రోడ్లు మంజూరుకు నోచుకోకుండా మిగిలిపోగా.. మంజూరైన రోడ్లు సైతం ఏళ్ల తరబడి పూర్తికావడం లేదు. దీంతో ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. నిత్యం ఏదో ఓ చోట ప్రమాదాలబారిన పడుతున్నారు. కొద్దిపాటిదూరమైనా ప్రత్యామ్నాయ మార్గం ఎంచుకోక తప్పడం లేదని వాపోతున్నారు. వంతెనల నిర్మాణాలకు సైతం నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా నేటికీ పూర్తవ్వడం లేదు. నిధులు మంజూరు చేయడం.. శిలాఫలాకాలు వేయడం.. ఆతర్వాత పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్‌కు నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండడంతో సదరు కాంట్రాక్టర్ పనులు మధ్యలోనే వదిలేస్తున్నాడని పలువురు విమర్శిస్తున్నారు. మరికొందరు కాంట్రాక్టర్లు పనులు చేపట్టకుండానే అధికారులు, ప్రజాప్రతినిధులు అటుగా కన్నెత్తి చూడకుండా లోపాయికారి ఒప్పందాలు జరుగుతున్నాయనే ఆరోపణలు సైతం వెల్లువెత్తుతున్నాయి.

❝ చర్యలు తీసుకుంటాం

నిధుల కొరతతో రోడ్డు నిర్మాణ పనులు అక్కడక్కడ నిలిచిపోయాయి. మిగిలిన పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఉమేశ్, పంచాయతీరాజ్ ఈఈ

రైతును రాజు చేసి తీరుతాం

- కాంగ్రెస్‌తోనే వారి కష్టానికి తగిన ఫలితం
- రూ.20వేల కోట్లతో ఏకకాలంలో రుణమాఫీ
- సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేస్తాం
- మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క

పరిగి: రైతులు సాగు చేసిన పంటలకు, వారు పడిన కష్టానికి కాంగ్రెస్ పాలనలోనే దక్కుతోందని వ్యసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా పరిగి పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డులో మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డిలతో కలిసి పరిగి మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారానికి హాజరయ్యారు. అనంతరం పట్టణ కేంద్రంలో టీయూటీఎఫ్ నిధులతో రూ.25 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో రైతును రాజు చేసి తీరుతామన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ రైతుల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది లోపు రైతులకు రు.2లక్షల వరకు రుణమాఫీ చేశామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామన్నారు. త్వరలోనే రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమ చేస్తామన్నారు. రైతులకు అన్ని రకాల పరికరాలను సబ్సిడీపై అందజేస్తామన్నారు. వ్యవసాయం ప్రస్తుతం డ్రోన్‌ల ద్వారా పిచికారీ తదితర పనులకు ఉపయోగిస్తున్నారని.. 80శాతం సబ్సిడీపై మహిళలకే అందజేస్తున్నామన్నారు. వికారాబాద్ జిల్లా పంటల సాగుకు చాలా అనువైన ప్రాంతమన్నారు. అన్ని రకాల పంటలు సాగు అవుతాయని కావున రైతులు నూతన పద్ధతిలో పంటలను సాగు చేయాలని సూచించారు.

రైతు అంటేనే శాస్త్రవేత్త

రైతులు అంటేనే శాస్త్రవేత్తలని.. పంటలపై రైతులకు ఉన్న అనుభవం ఎవరికీ లేదని పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. రైతు పంట సాగు నుంచి కోత, విక్రయాల వరకు పూర్తిగా తనదే బాధ్యతగా పని చేస్తారన్నారు. అన్నదాతల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిందని, బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉండి చేయలేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. పట్టణ, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ప్రమాణ స్వీకారం, చిత్రంలో ఎమ్మెల్యే టీఆర్ఆర్, మండలి చీఫ్‌విప్ మహేదర్‌రెడ్డి, మంత్రులు తుమ్మల, సీతక్క తదితరులు

కలవని 'చేతులు'



చేవెళ్ల కాంగ్రెస్‌లో ముదిరిన వర్గపోరు

- ముఖ్యమంత్రి కార్యక్రమానికి హాజరుకాని ఓ వర్గం
- స్థానిక ఎమ్మెల్యే సమాచారం ఇవ్వలేదని ఆరోపణ
- ఏ వర్గం వారికి వారే సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ
- మార్కెట్ కమిటీల్లో చోటు దక్కలేదని కొంతమంది కినుక

మొయినాబాద్: చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు తీవ్రస్థాయికి చేరింది. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరైన కార్యక్రమానికే కాంగ్రెస్‌లోని ఓ వర్గం దూరంగా ఉండడం చర్చనీయాంశమైంది. స్థానిక ఎమ్మెల్యే తమకు సమాచారం ఇవ్వలేదని సదరు వర్గం నాయకులు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటి నుంచి వర్గ పోరు మొదలైంది. ఎన్నికల తరువాత కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలంతా నియోజకవర్గం ఇన్‌చార్జి భీంభరత్ వెంటే ఉన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్‌లో చేరడంతో కొందరు నాయకులు ఆయన కోటరీకి వెళ్లారు.

సమాచారం ఇవ్వలేదంటూ..

మొయినాబాద్ మండలం చిలుకూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం కామన్ డైట్ మెనూ ప్రారంభించారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరైన ఈ కార్యక్రమానికి భీంభరత్‌తోపాటు ఆయన వర్గం పూర్తిగా దూరంగా ఉంది. ఎమ్మెల్యే కాలె యాదయ్య కార్యక్రమాన్ని పూర్తిగా దగ్గరుండి నడిపించారు. ఎమ్మెల్యే వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు మాత్రమే కనిపించారు. ఎమ్మెల్యే తమకు సమాచారం ఇవ్వలేదని.. కార్యక్రమం మొదలు కావడానికి రెండు గంటల ముందు వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ పెట్టారని భీంభరత్ వర్గం ఆరోపిస్తోంది.

ఎవరికి వారే యమునా తీరే..

ప్రస్తుతం చేవెళ్ల కాంగ్రెస్ పార్టీలో ఎవరికి వారే యమునాతీరే అన్న పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలో ఎక్కడ కార్యక్రమాలు జరిగినా ఏ నాయకుడు హాజరైతే ఆ వర్గంవారే పాల్గొంటున్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీలోనూ ఇదే జరుగుతోంది. ఏ వర్గం వారికి చెందిన చెక్కులు ఆ వర్గంవారే లబ్ధిదారులకు అందజేస్తున్నారు. దీంతో కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు ఎవరి వెంట వెళ్తే ఏమవుతుందోనని ఆవేదనకు గురవుతున్నారు. మరోవైపు ఇటీవల ప్రకటించిన మార్కెట్ కమిటీల్లో అవకాశం దక్కని నాయకులు కినుక వహించారు. పదేళ్ల పాటు కష్టపడి పార్టీకోసం పనిచేసిన తమకు అవకాశాలు దక్కడంలేదని కొందరు బాహాటంగానే విమర్శిస్తున్నారు. పార్టీలో నెలకొన్న వర్గపోరు సద్దుమణిగేలా అధినాయకత్వం ఎలా వ్యవహరిస్తుందో వేచి చూడాలి.

గ్రూప్-2 పరీక్షలు ప్రారంభం

తొలిరోజు ప్రశాంతం

- నిమిషం నిబంధనతో 69 మంది అభ్యర్థులకు నిరాశ

అనంతగిరి: జిల్లా వ్యాప్తంగా ఆదివారం గ్రూప్–2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. అభ్యర్థులు ముందే సెంటర్ల వద్దకు చేరుకున్నారు. అక్కడ అధికారులు తనిఖీల అనంతరం సెంటర్లలోకి పంపించారు. వికారాబాద్ రీజియన్‌లో 19, తాండూరు రీజియన్‌లో 11 సెంటర్లు ఏర్పాటు చేశారు. నిమిషం ఆలస్యం నిబంధన ఉండటంతో జిల్లా వ్యాప్తంగా 69మంది అభ్యర్థులు నిరాశతో వెనుదిరిగారు. రెండు రీజియన్‌లలో కలిపి మొత్తం 10,381మందికి గాను ఉదయం పేపర్‌కు 5,147మంది హాజరుకాగా, 5,234మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పేపర్‌కు 5,135మంది హాజరుకాగా, 5,246మంది గైర్హాజరయ్యారని సంబంధిత అధికారులు తెలిపారు.



పరిగి: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



అనంతగిరి: వికారాబాద్‌లోని ఎస్‌ఏపీ కళాశాల వద్ద అభ్యర్థుల పరుగులు



సమయానికి వచ్చినా అనుమతించలేదంటూ అభ్యర్థుల ఆందోళన

సమయానికి వచ్చినా..

తాండూరు: పట్టణంలోని చైతన్య జూనియర్ కళాశాలలో గ్రూప్–2 పరీక్ష రాసేందుకు పెద్దేముల్ మండలం ఇందూర్ గ్రామానికి చెందిన వీణ 9.29 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకుంది. లోనికి అనుమతించేందుకు పరీక్షా కేంద్రం ఎదుట సిబ్బంది తనిఖీ చేసింది. మరో అభ్యర్థిని చెక్ చేస్తుండగా వీణ సెంటర్‌లోకి వెళ్తుండగా నిర్వాహకులకు ఆలస్యమైందంటూ గేట్‌వేశారు. సమయానికి వచ్చిన తమను పరీక్షా కేంద్రంలోకి పంపకపోవడంపై ఇద్దరు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

పరీక్షలు రాసిన ఇద్దరు ఎస్సైలు

తాండూరు: పోలీసు శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్‌లుగా విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఆదివారం గ్రూప్–2 పరీక్షలు రాసేందుకు పరీక్షా కేంద్రానికి వచ్చారు. పట్టణంలోని సింధు డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న స్రవంతి పరీక్ష రాసేందుకు వచ్చారు. మరోవైపు గతంలో బషీరాబాద్ ఎస్సైగా విధులు నిర్వహించిన ఎస్సై రమేశ్ గ్రూప్–2 పరీక్ష రాసేందుకు హాజరయ్యారు.



పరీక్ష రాసేందుకు వచ్చిన ఎస్‌ఐలు స్రవంతి, రమేశ్

క్లుప్తంగా

దీపం కిందపడి ఇల్లు దగ్ధం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని టేకుల్‌కోడ్ గ్రామంలో దేవుడి ముందు వెలిగించిన దీపం కింద పడి ఇల్లు దగ్ధమైన సంఘటన ఆదివారం చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన బాధితురాలు యాదమ్మ తెలిపిన వివరాలు.. రోజుమాదిరిగా దేవుడికి పూజలు చేసి దీపం వెలిగించానని, కొంత సమయానికి ప్రమాదవశాత్తు కిందపడి బట్టలు, పరిసరాలలో ఉన్న బియ్యం, జొన్నలు, పప్పుధాన్యాలు కాలిపోయి బూడిదయ్యాయని రోదిస్తోంది. అగ్నిమాపక వాహనం సంఘటనా స్థలానికి చేరుకునే సమయానికి ఇంటి పైకప్పుదాకా మంటలు చెలరేగి నష్టం జరిగిందని వాపోయింది. అగ్ని మాపక వాహన సిబ్బంది చెలరేగుతున్న మంటలను ఆర్పి అదుపులోకి తెచ్చారు. దాదాపు రూ.30 వేల నష్టం జరిగిందని తనకు సహాయం అందించాలని బాధితురాలు కోరుతున్నారు.

కుమారుడి కోసం వెళ్లి.. అనంత లోకాలకు

బైక్ అదుపు తప్పి తండ్రి దుర్మరణం


రాజునాయక్ మృతదేహం

పరిగి: కుమారుడిని హైదరాబాద్‌కు తీసుకు వస్తానని వెళ్లిన తండ్రి అనంత లోకాలకు చేరిన సంఘటన చింతల్‌కుంట చెరువు మూలమలుపున ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ జిల్లా సేడెం తాలూకా గోపన్‌పల్లి గ్రామానికి చెందిన రాజునాయక్(30) ఐదేళ్లుగా భార్యతో కలిసి నగరంలో లేబర్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. చిన్న కొడుకు స్వగ్రామంలో ఉండటంతో నగరానికి తీసుకురావడానికి రాజునాయక్ ఆదివారం తన స్నేహితుడి ద్విచక్ర వాహనాన్ని తీసుకుని బయలు దేరాడు. మార్గమధ్యలో పరిగి మండలం చింతల్‌కుంట చెరువు మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడటంతో ఆయన తలకు తీవ్రగాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సావిత్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పొలాల్లో పొంచి ఉన్న ప్రమాదం


వేలాడుతున్న విద్యుత్ తీగలు

దుద్యాల్: నిత్యం పొలాల్లో పనులు చేసుకునే రైతులకు విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉంది. మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన చాకలి వెంకటయ్య అనే రైతు పొలంలో విద్యుత్ స్తంభాలకు తీగలు వేలాడుతుండడంతో పంట కోసేందుకు హార్వెస్టర్ రావడానికి ఇబ్బందిగా మారిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. శుక్రవారం తన పొలంలో కంది పంటను కోసేందుకు వచ్చిన హార్వెస్టర్ వైర్లకు తగలడంతో మంటలు సంభవించాయని తెలిపారు. ఇదిలా ఉంటే ఒక స్తంభం పూర్తిగా వంగిపోయి వైర్లు కిందికి వేలాడుతున్నాయని ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందో అని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరుతున్నాడు.

పుచ్చ సాగుకు సమయమిదే

ఆరుతడి పంటగా అనుకూలం
- తక్కువ నీటి వినియోగం
- మేలైన రకాలతో అధిక దిగుబడి


నర్సరీలో సాగవుతున్న పుచ్చ నారు

నవాబుపేట: రబీలో ఆరుతడి పంటగా పుచ్చను సాగు చేసి లాభాలు పొందవచ్చంటున్నారు ఉద్యానవన అధికారులు. ఈ పంట సాగుకు ఇదే అనువైన సమయమని డిసెంబర్‌లో విత్తనాలు విత్తితే మార్చి వరకు పంట చేతికి వస్తుంది. పంటకు ఇసుక నేలలు అనుకూలమని, మేలైన రకాలను ఎంచుకుని తగు జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని అధికారులు చెబుతున్నారు. పుచ్చకాయ సాగుకు ఎకరానికి రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు వస్తుంది. 60 నుంచి 80 క్వింటాళ్ల వరకు దిగుబడి ఆశించవచ్చు. దీంతో రైతులు పుచ్చ సాగుకు ఆసక్తి చూపుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు. గతేడాది వికారాబాద్ డివిజన్ పరిధిలో 250 ఎకరాల్లో సాగు చేశారు. ఈసారి మరింత పెరిగే ఆస్కారం ఉంది.

విత్తుకునే విధానం

ఎకరానికి అర కిలో విత్తనాలు సరిపోతాయి. విత్తన శుద్ధి చేసి విత్తుకోవడం ఉత్తమం. అందుకోసం కిలో విత్తనానికి 3 గ్రాముల కాప్టాన్ లేదా మాంకోజెల్ పట్టించాలి. ముందుగా నేలను బాగా దున్ని, చదును చేసుకోవాలి. సారవంతమైన నేలలో 3 మీటర్ల ఎడం పాటించి విత్తుకోవాలి. తేలికపాటి, సాధారణ నేలల్లో 25 మీటర్ల ఎడం, 60 సెంటీ మీటర్ల వెడల్పు గల నీటి కాల్వలు ఏర్పాటు చేసుకోవాలి.

నీటి యాజమాన్యం

విత్తనాలు నాటిన తర్వాత మొలిచేందుకు ఒక తడి నీరందించాలి. ఆ తర్వాత నేల స్వభావం, వాతావరణాన్ని బట్టి 5 నుంచి 7 రోజులకోసారి నీరు పెట్టాలి. పూత సమయంలో నీరందిస్తే ఉత్తమం. కాయలు ఎదిగే దశలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. కలుపు నివారణ కోసం లీటరు నీటికి 6 మి.లీ పెండిమిథాలన్ లేదా ఆలాక్లోర్ కలిపి, కాల్వ బోదెలకు విత్తనం విత్తిన రెండు రోజుల్లో పిచికారీ చేయాలి.

మేలైన పుచ్చ రకాలు

అసాహియమాటా: ఈ రకం కాయలు 6 నుంచి 8 కిలోల బరువుతో పైన లేతాకు పచ్చరంగు, లోపల చిక్కటి గులాబీ రంగు కండ కలిగి ఉంటాయి. 11 నుంచి 13 శాతం చక్కరతో 95 రోజుల్లో పండు పక్వానికి వస్తాయి. ఎకరానికి 90 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

షుగర్ బేబి: ఇవి త్వరగా విత్తుకోవడానికి అనువైనవి. కాయలు చిన్నవిగా, 2 నుంచి 3 కిలోల బరువుతో గుండ్రంగా ఉంటాయి. పైన నీలి వర్ణపు నలుపు, లోన చిక్కటి గులాబీ రంగు కండ ఉంటుంది. 11 నుంచి 13 శాతం చక్కరతో 80 నుంచి 85 రోజుల్లో పక్వానికి వస్తాయి. ఎకరానికి 60 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది.

అర్కజ్యోతి, అర్కమానిక్: పండ్లు గుండ్రంగా ఉండి పైనా ఆకుపచ్చ, ముదరాకుపచ్చ చారలతో ఉంటాయి. లోపల ఎరుపు కండ ఉంటుంది. 6 నుంచి 8 కిలోల బరువుతో ఎకరాకు 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఇవికాక ఎక్స్ ఎస్–3955, అపూర్వ స్వీట్‌డ్రాఎక్స్, మాధురి, మధుబిందు, ఏటీటీ–3088 తదితర హైబ్రిడ్ రకాలు ఉన్నాయి.

ఎరువుల వినియోగం

ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువును వేసుకోవాలి. అదే విధంగా 250 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 40 కిలోల మ్యురేట్ ఆఫ్ పోటాష్, 90 కిలోల యూరియాను వాడాలి. నత్రజని ఎరువును నాటేటప్పుడు రెండుపర్యాయాలు, 25 రోజుల తర్వాత మరోసారి వేయాలి. పూత, పిందె సమయంలో 80 కిలోల కాల్షియం, అమ్మోనియం, నైట్రేట్‌ను కలిపి మొదళ్లకు ఇరువైపులా వేసి మట్టి కప్పాలి. తీగపారే సమయంలో తల తుంచి, సూక్ష్మ ధాతువులు మొక్కలను అందేలా లీటరు నీటికి ఫార్ములా–4 లేదా ఆగ్రోమిక్స్ మాక్స్– గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

తెగుళ్ల నివారణ

మొజాయిక్ వెర్రి తెగులు సోకినప్పుడు ఆకులు ఆకారం కోల్పోయి ఆకుపచ్చ, పసుపురంగు మచ్చలు వ్యాపించి బొబ్బలు ఏర్పడతాయి. తీగలు కురుచగా మారి, తక్కువ కాపు, కుక్కమూతి పిందెలు వస్తాయి. వీటి నివారణకు పంట తొలిదశలోనే వైరస్ సోకిన మొక్కలను ఏరి నాశనం చేయాలి. తెగులు వ్యాప్తికి దోహదపడే పేనుబంక పురుగు నివారణకు లీటరు నీటికి 15 గ్రాముల ఎసిఫేట్ కలిపి, ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

లాభదాయకం



రైతులు ఆరుతడి పంటగా పుచ్చను సాగు చేసుకొని లాభాలు పొందవచ్చు. ఈ పంట సాగుకు నీటి అవసరం తక్కువగా ఉంటుంది. ఈ ప్రాంత వాతావరణానికి అనువైన రకాలను ఎంపిక చేసుకొని విత్తుకోవాలి. పూత, కాయదశల్లో తగుజాగ్రత్తలు పాటించి కాయ ఊరేలా చూసుకోవాలి.

– అక్షితరెడ్డి, ఉద్యానశాఖ అధికారి, వికారాబాద్ డివిజన్

పోగొట్టుకున్న పర్సు అందజేత

కండక్టర్ శ్యామలకు ప్రశంసల వెల్లువ


పోగొట్టుకున్న పర్సును వృద్ధురాలికి అందజేస్తున్న కండక్టర్, డ్రైవర్

పరిగి: ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ఓ వృద్ధురాలు తన పర్సు పోగొట్టుకోవడంతో కండక్టర్ శ్యామల తిరిగి అందజేశారు. మండల పరిధిలోని చిట్యాల గ్రామానికి చెందిన అమినబీ పరిగి నుంచి షాద్‌నగర్ వెళ్లే బస్సులో ప్రయాణం చేసింది. ఈ క్రమంలో ఆమె కూర్చున్న సీట్లో పర్సు పెట్టి తను దిగాల్సిన స్టేజీ రాగానే బస్సు దిగేసింది. పడిపోయిన పర్సును వేరే ప్రయాణికుడు తీసుకుని వెళ్తుండగా గమనించిన కండక్టర్ ఈ సీట్లో ఓ వృద్ధురాలు కూర్చుంది ఆమెదే ఈ పర్సు అని పర్సు తీసుకుని పరిశీలించగా అందులో రూ.10వేల నగదు, ఆధార్ కార్డు లభ్యమైంది. ఆధార్ కార్డు వివరాల ఆధారంగా బస్సు తిరుగు ప్రయాణంలో గ్రామం స్టేజీ వద్ద బస్సు ఆపి వృద్ధురాలికి పర్సు అప్పగించింది. దీంతో డ్రైవర్ రాజు, కండక్టర్ శ్యామలను పలువురు అభినందించారు.

తిననీయవు.. చదవనీయవు

ధారూరు: వానరాలతో నిత్యం అవస్థలు పడుతున్నామని మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా భోజన సమయంలో ఆహార పదార్థాల కోసం కోతులు ఎగబడి అందిన కాడికి లాక్కుంటున్నాయని వాపోయారు. ఆదివారం కోతులు విద్యార్థినులను భయభ్రాంతులకు గురిచేయడంతో బాలికలు పరుగులు పెట్టారు. తింటున్న ప్లేట్లను లాగేసుకునే మరీ నానా అలజడి సృష్టించాయి. మర్కటాలతో వేగలేక పోతున్నామని విద్యార్థినులు లబోదిబోమంటున్నారు. కోతుల కట్టడికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


విద్యార్థినులను వెంబడిస్తున్న వానరం

ఘనంగా మోత్కుపల్లి జాతర


కుల్కచర్ల: గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తజనం


కొడంగల్: మూల విరాట్

కొడంగల్: నియోజకవర్గ సరిహద్దులో కర్ణాటక రాష్ట్రంలోని మోత్కుపల్లి క్షేత్రంలో వెలిసిన శ్రీబల భీమరాయుడి (బల భీమసేన) ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. వారం రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి రథోత్సవం జరిగింది. ప్రతి సంవత్సరం డిసెంబర్ నెలలో వచ్చే పౌర్ణమి రోజు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. మొక్కులు చెల్లించుకుంటారు. నియోజకవర్గ పరిధిలో వేలాది మంది భక్తులకు భీమరాయుడు ఇలవేల్పుగా ఉన్నారు. ఆదివారం పౌర్ణమి రోజు ప్రత్యేక వంటకాలు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. వారం రోజుల పాటు స్వామి జాతర ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి.

శోభాయమానంగా..

కుల్కచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో ఆదివారం హిందూ ఉత్సవ కమిటీ, గిరిప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో క్షేత్రం చుట్టూ పాదయాత్రగా ప్రదక్షిణలు నిర్వహించారు. ప్రతీ పౌర్ణమి రోజున పాంబండ ఆలయం చుట్టూ గిరిప్రదక్షిణ చేయడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. గిరి ప్రదక్షిణ అనంతరం రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వృద్ధుడి అదృశ్యం


వెంకటయ్య (ఫైల్)

చేవెళ్ల: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు.. మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన కటికం వెంకటయ్య(70)కు మతిస్థిమితం సరిగా లేదు. ఇంటివద్దనే ఉండే అతడు రోజు గ్రామంలో తిరిగి ఇంటికి వచ్చేవాడు. ఎప్పటి మాదిరిగానే శనివారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి రాత్రి వరకు తిరిగి రాలేదు. ఆ తర్వాత కుటుంబ సభ్యులు గ్రామస్తులను, తెలిసిన వారిని అడిగిన అతని జాడ తెలియలేదు. దీంతో ఆదివారం ఉదయం చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో కొడుకు శివకుమార్ తన తండ్రి కనిపించటం లేదని ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు వృద్ధుడు అదృశ్యమైనట్లుగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా ఎలాంటి సమాచారం తెలిసిన చేవెళ్ల ఠాణాను సంప్రదించాలని కోరారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్

బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఢిల్లీలో ప్రదానం

చేవెళ్ల: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది వివిధ రంగాల్లో రాణించే వారిని గుర్తించి అవార్డులను ప్రదానం చేస్తోంది. ఇందులో భాగంగానే చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది పెంటయ్యగౌడ్‌కు కర్షకరత్న అవార్డుకు ఎంపిక చేసింది. ఆదివారం ఢిల్లీలో జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో ఆయనకు సంస్థ వ్యవస్థాపకుడు నల్ల రాధాకృష్ణ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందని ఒక రైతు గా, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రైతులకు నిరంతరం సేవ లు అందిస్తానని చెప్పారు. అదేవిధంగా మండలంలోని రావులపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కేసారం శ్రీ నివాస్‌ను కూడా ఈ అకాడమీ ద్వారా ఉత్తమ సర్పంచ్ అవార్డుకు ఎంపిక చేసి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి అ వార్డును అందించటం సంతోషంగా ఉందని చెప్పారు. అ వార్డుకు ఎంపిక చేసిన వారికి ప్రత్యేక కృతజ్ఞతులు తెలిపారు.

సమ్మెబాటలో 'సమగ్ర' ఉద్యోగులు

ఇచ్చిన హామీలు అమలు చేయాలని దీక్ష

కొడంగల్ రూరల్: తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని శాఖ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నారు. తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్‌లో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, జిల్లా విద్యాశాఖ కార్యాలయంతో పాటు మండల స్థాయిలో డాటా ఎంట్రీ ఆపరేటర్లు, సీఆర్‌పీలు, ఐఈఆర్‌టీ, కేజీబీవీ, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, ఆఫీస్ అసిస్టెంట్లు(మెసెంజర్లు), ఒప్పంద ఉద్యోగులుగా గత ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్నారు. సమగ్ర శిక్షా అభియాన్‌ను విద్యాశాఖలో విలీనం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలను సవరించాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిరసనలతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించపోవడంతో 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నారు. జిల్లా కేంద్రంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నాచౌక్‌లో నిరసనలు వ్యక్తం చేస్తూ దీక్ష కొనసాగిస్తున్నారు. గతేడాది 23 రోజులపాటు సమ్మెలో పాల్గొనగా అప్పటి ప్రభుత్వం హామీ మేరకు నిరసనలు విరమించారు. మండల విద్యాధికారులకు క్లస్టర్ ప్రధానోపాధ్యాయులకు వారధిగా పనిచేస్తూ, జిల్లా నుంచి వచ్చే రిపోర్టులన్నీ ఎప్పటికప్పుడు సంబంధిత పాఠశాలలకు చేరవేసి వాటి వివరాలను పొందుపరుస్తూ ఎంఆర్‌సీలకు అందిస్తూ విధులు నిర్వహిస్తున్న తమను క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

క్రమబద్ధీకరించాలి



మెరిట్, రోస్టర్, ఇంటర్వ్యూ, రిటర్న్ టెస్టు తదితర అంశాల ఆధారంగా మమ్మల్ని ఎంపిక చేశారు. విద్యా వ్యవస్థను బలోపేతానికి కృషి చేస్తున్న తమను క్రమబద్ధీకరించాలి. ఎన్నికల వేళ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలి.

– రాఘవేందర్, ఎంఐఎస్ సంఘం, జిల్లా ఉపాధ్యక్షుడు

ఉద్యోగ భద్రత కల్పించాలి



సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలి. పే స్కేల్‌తోపాటు రెగ్యులరైజ్ చేస్తూ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి.

– స్రవంతి, కేజీబీవీ ఎస్‌ఓ, కొడంగల్

దీక్షకు మద్దతుగా ఉపాధ్యాయ సంఘాలు



దీక్షలో కూర్చున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

బొంరాస్‌పేట: సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న దీక్షకు మద్దతుగా పలు ఉపాధ్యాయ సంఘాల మండల నాయకులు ఆదివారం మద్దతు తెలిపాయి. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను విద్యాశాఖలో 'విలీనమే మా లక్ష్యం.. రెగ్యులారిటీ మా పంతం' అనే నినాదంతో జిల్లా కేంద్రంలో చేస్తున్న రిలే దీక్షల్లో పీఆర్‌టీయూ, టీజీ యూటీఎఫ్, తపస్ సంఘం ఉపాధ్యాయులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం స్పందించి త్వరలో హామీలు నెరవేరుస్తుందని భరోసా ఇచ్చారు. ఇందులో ఆయా సంఘాల జిల్లా, మండల నాయకులు రవీందర్‌గౌడ్, అనిల్‌కుమార్, చంద్రశేఖర్, గోపాల్ తదితరులున్నారు.

కేజీబీవీలో ఫినాయిల్ తాగిన విద్యార్థిని

- పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు
- ప్రమాదం లేదని వెల్లడించిన వైద్యులు

దోమ: స్థానిక కేజీబీవీలో ఆదివారం ఓ విద్యార్థిని ఫినాయిల్ తాగి అస్వస్థతకు గురైంది. వివరాలు.. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని కేజీబీవీలో పదోతరగతి చదువుతోంది. గదిలో ఎవరూ లేని సమయంలో ఓ విద్యార్థిని వద్ద రూ.500 దొంగిలించింది. దొంగిలించిన విద్యార్థిని గుర్తించిన తోటి విద్యార్థులు భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె పాఠశాలలో ఉన్న ఫినాయిల్ తాగి అస్వస్థతకు గురైంది. గమనించిన ఉపాధ్యాయులు ఆమెను వెంటనే పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఎలాంటి ప్రమాదం లేదని చెప్పడంతో ఊపిరిపీల్చుకున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఏడుగురి అరెస్టు.. రూ.58వేలు స్వాధీనం

ఇబ్రహీంపట్నం రూరల్: పేకాట స్థావరంపై ఎస్‌ఓటీ, ఆదిబట్ల పోలీసులు దాడి చేశారు. ఏడుగురు జూదరులను అరెస్టు చేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. నాదర్‌గుల్‌లోని ప్లాటినం సిటీలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం రావడంతో ఆదిబట్ల పోలీసులు, మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అరెస్టు చేశారు. వీరంతా నగరంలోని బీఎన్ రెడ్డి, కర్మాన్‌ఘాట్, హస్తినాపురానికి చెందిన వారు. వీరి వద్ద రూ.58,710 నగదు, ప్లేయింగ్‌కార్డ్స్, ఏడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



బాధ్యతలు చేపడుతున్న జిల్లా కార్యవర్గం

అనంతగిరి: టీఎస్‌యూటీఎఫ్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా సీహెచ్.వెంకటరత్నం ఐదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి పరిగిలోని కేఏఆర్ గార్డెన్‌లో జరిగిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. 2024–26 సంవత్సరానికి గాను 68మంది జిల్లా కమిటీ సభ్యులతో 15మంది కార్యదర్శివర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా రాష్ట్ర కార్యదర్శిగా మానిక్‌రెడ్డి వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా సీహెచ్ వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శిగా రాములు, ఉపాధ్యక్షులుగా నర్సింలు, జమున, కోశాధికారిగా ఎండీ మోయిజ్‌ఖాన్, కార్యదర్శులుగా నీలమ్మ, బాబురావు, పవన్, రత్నం, కృష్ణవేణి, మల్లేశం, ఎండీ సలీం, వెంకటయ్య, ముత్యప్ప, బసప్ప, శంకర్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎస్.నర్సింలును నియమించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మరోసారి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యలపై ముందుండి పోరాటం చేసి సమస్య సాధనకై కృషి చేస్తామన్నారు. విద్యారంగ సమస్యల సాధనకు పాటుపడుతానన్నారు.


ప్రాజెక్టులో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

వీకెండ్ విహారం.. ఆహ్లాదభరితం

ధారూరు: వీకెండ్ వచ్చిందంటే చాలు పర్యాటకులు కోట్‌పల్లి ప్రాజెక్టుకి తరలుతున్నారు. హైదరాబాద్ నుంచి యువతీ, యువకులు ఆదివారం ఉదయమే ప్రాజెక్టుకు వచ్చి సాయంత్రం వరకు గడిపి వెళ్లారు. బోటింగ్ చేస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. అనంతరం వన భోజనాలు చేసి ఆత్మీయులతో సరదాగా ఫొటోలకు ఫోజులిచ్చారు.


ఫొటోలకు ఫోజులిస్తున్న యువత